# నమస్తే తెలంగాణ

## ములుగు
## జయశంకర్ భూపాలపల్లి

5 | వరంగల్, శుక్రవారం 28 మార్చి 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY




### పంట నష్టపరిహారం చెల్లించాలి..

మునుపటి లెక్క నీళ్లిస్తరని ఆశతో వరి పంట ఏసినం. రెండున్నర ఎకరాలు నాటుపెడితె నిట్టనిలువున ఎండింది. కత్తులోరి కుంటల నీళ్లుంటె బోర్లు పోసేది. కుంట ఎండింది బోర్లు పోయినయ్. నీళ్లొస్తయని కండ్లు కాయలు కాసేలా చూసినం.. రాలే. పక్క మండలం గుండాలకు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నా భూమిల నుంచి కాల్వ తీసి జబర్దస్తిగ దేవాదుల నీళ్లు తీసుకుపోయిండు. మా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి నీళ్లు తెస్తదని నమ్మకముండె.. దాన్ని వమ్ము చేసింది. బర్రె దూడెలు, ఎడ్లను మేపుతున్న. నాకైన అప్పు పదేండ్లయినా తీరదు. మా ఎమ్మెల్యే మా కోసం కొట్లాడి పంట నష్టపరిహారం ఇప్పించాలె.

– మేడ రాజు, రైతు, సింగరాజుపల్లి, దేవరుప్పుల





దేవన్నపేట పంప్‌హౌస్ నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి చేరుతున్న గోదావరి జలాలు

# హమ్మయ్య..
# పంపు నడిచింది

- దేవన్నపేట పంప్‌హౌస్‌లో ఒక మోటర్ ఆన్ చేసిన ఇంజినీర్లు
- మంత్రులు ఉత్తమ్, పొంగులేటి వచ్చాక మళ్లీ మొరాయించిన పంపులు
- ఎట్టకేలకు ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి చేరుతున్న గోదావరి జలాలు
- చివరి దశలో ఉన్న పంటలకు నీళ్లందుడు కష్టమే

హనుమకొండ సబర్బన్, మార్చి 27 : దేవాదుల ఎత్తిపోతల పథకం మూడోదశ మోటర్లు నడిచే విషయమై వారం రోజులుగా కొనసాగిన ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. 5.57 లక్షల ఎకరాలకు సాగునీరందించడమే లక్ష్యంగా గతంలో కేసీఆర్ నిర్మించిన చివరి దశకు తీసుకొచ్చిన మూడో దశ మోటర్లను నడిపించడంలో ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్న విమర్శల నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున ఇంజినీర్లు ఒక మోటరును నడిపించారు. దీంతో కొంతమేర ఊరట లభించినప్పటికీ ప్రస్తుత పరిస్థితిల్లో ఇవి ఏ మాత్రం సరిపోవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈసారి ఓఅండ్ఎం కార్మికులకు వేతనాలు ఇవ్వని కారణంగా 37 రోజుల పాటు దేవాదుల నుంచి నీటి పంపింగ్ నిలిచిపోయింది. దీనికితోడు దేవన్నపేట పంప్‌హౌస్ పనులు ఎప్పుడో పూర్తయినప్పటికీ మోటర్ల ట్రయల్ రన్ నిర్వహించలేదు. పైగా ఎలాంటి ముందస్తు ఏర్పాట్లు, ట్రయల్‌రన్ లేకుండానే ఈ నెల 18న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పంప్‌హౌస్‌ను ప్రారంభించేందుకు వచ్చారు. పూజా కార్యక్రమాల అనంతరం మోటర్లను ఆన్ చేయగా అవి మొరాయించాయి. దీంతో ఎంత రాత్రయినా మోటర్లను ఆన్ చేస్తామని ప్రకటించిన మంత్రులు అక్కడే మకాం వేశారు. అయితే మోటర్లు ఆన్ అయ్యే పరిస్థితి లేకపోవడంతో చివరకు వెళ్లిపోయారు. ఆస్ట్రియా నుంచి ప్రోటోకాల్ ఇంజినీర్ రావాలని చెప్పిన నీటి పారుదల శాఖ అధికారులు అతడు వచ్చి మూడు రోజులు దాటినప్పటికీ ఇప్పటి వరకు నీటిని ఇవ్వలేకపోయారు. స్కాడా సిస్టం ద్వారా పంపులు ఆన్ చేసేందుకు ఇంజినీర్లు కృషి చేస్తున్నప్పటికీ సాంకేతిక కారణాల వల్ల మోటర్లు ఆన్ కాలేదు. దీంతో మళ్లీ మొదటి నుంచి కమిషనింగ్ చేస్తూ వచ్చిన అధికారులు ఎట్టకేలకు తెల్లవారుజామున ఒక పంపును ఆన్ చేసి సుమారు నాలుగు గంటల పాటు ట్రయల్ రన్ చేశారు. దీంతో మళ్లీ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి వస్తున్న సమాచారంతో ఇంజినీర్లు మోటర్‌ను నిలిపివేశారు. హుటాహుటిన దేవన్నపేట పంప్‌హౌస్‌కు మంత్రులు చేరుకున్న అనంతరం మళ్లీ మోటర్లు ఆన్‌కాకుండా మొరాయించాయి. దాదాపు 40 నిమిషాల పాటు శ్రమించిన ఇంజినీర్లు ఒక మోటర్‌ను ఆన్ చేశారు. ప్రస్తుతం నడిపిస్తున్న మోటర్ ద్వారా నిత్యం 16.8 క్యూసెక్కుల నీరు ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి చేరుతుంది. రామప్ప చెరువు నుంచి నేరుగా టన్నెల్ ద్వారా వచ్చే నీటిని ధర్మసాగర్‌లోకి తరలించనున్నారు. రామప్పలో ప్రస్తుతం 207 మీటర్ల నీటి మట్టం ఉండగా అందులో మూడు మీటర్ల నీటిని తోడుకునే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే గోదావరి జలాలు విడుదల చేయడంలో తీవ్ర జాప్యం కావడంతో పంటలు చేతికొచ్చుడు మాత్రం అనుమానాస్పదంగానే ఉంది.



కొడకండ్ల మండలం నీలిబండ తండాలో ఎండిన వరి పొలంలో పశువులను మేపుతున్న రైతు

ఫీల్డ్ విజిట్

# పొలం ఎండి
# గుండె మండి

## పశువులకు మేతగా పంట చేన్లు..

**కండ్ల ముందే పచ్చటి పొలాలు ఎండుతుంటే రైతుల గుండె మండిపోతున్నది. పంటలు కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడినప్పటికీ ఫలితం లేదు. దీంతో చేసేదేమీలేక పశువులను మేపుతున్నారు. జనగామ జిల్లాలో సకాలంలో దేవాదుల నీళ్లు రాక కష్టాలు చుట్టుముట్టాయి. గోదావరి జలాలు విడుదల చేయకపోవడంతో బోర్లు, బావులు వట్టిపోయాయి. చెరువులు, కుంటలు ఎండిపోయాయి. భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఐదారు రోజుల్లో నీటిని వదలకుంటే మిగిలిన పంటలు కూడా పూర్తిగా ఎండిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే తాగు నీటికి ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి.**

**- జనగామ, మార్చి 27(నమస్తే తెలంగాణ)**

- సకాలంలో దేవాదుల నీళ్లు రాక రైతులకు కష్టాలు
- నెర్రెలు బారిన చెరువులు, కుంటలు
- జనగామ జిల్లాలో ప్రమాద స్థాయికి భూగర్భ జలాలు
- ఐదారు రోజుల్లో నీళ్లందకుంటే మిగిలిన పంటలూ జీవాలకే..

గతంలో మాదిరిగానే దేవాదుల నీటిని విడుదల చేసి నీటి వనరులన్నీ నింపితే భూగర్భ జలాలు పెరిగి బోర్లు, బావుల్లో పుష్కలంగా నీరుంటుందని ఆశపడి యాసంగి పంటలు వేసిన జనగామ జిల్లా రైతుకు మునుపటి కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. చెరువులు, కుంటలు, బోర్లు, బావులపై ఆధారపడి పంటలు సాగు చేయగా.. భూగర్భ జలాలు అడుగంటి నీళ్లు రాకపోవడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొన్నది. ప్రభుత్వ యంత్రాంగం మొద్దు నిద్ర కారణంగా జనగామ జిల్లాలోని పలు మండలాల్లో చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోయాయి. బోరు బావులు క్రమంగా వట్టిపోతున్నాయి. సరిపడా నీరందక చేతికొచ్చే దశలో ఇప్పటికే 50 శాతం పంటలు ఎండిపోయి పొలాలు పశువులకు మేతగా మారాయి. చేతికికొచ్చిన పంటలు మరో రెండు తడుల వద్ద ఎండిపోతున్నాయి. ఎకరాకు రూ.80 వేల వరకు పెట్టుబడి పెడితే చివరికి పశువులు, జీవాల మేతకు పెట్టాల్సి వస్తున్నది. చేసిన కష్టం పోగా పెట్టుబడులు రైతులకు అప్పులను మిగులుస్తున్నాయి. పదేండ్లు సాగు నీరు, కరెంటు కష్టాలు చూడని రైతులు ఇప్పుడు కరువును చూస్తున్నామని అంటున్నారు. నీళ్లొదలాలని రెండు నెలలుగా నెత్తీనోరు బాదుకున్నా పట్టించుకునే వారు లేకపోడంతో చేతికొచ్చిన పంటను గాలికి వదలాల్సి వచ్చిందని అన్నదాత కన్నీరుమున్నీరవుతున్నాడు. ఇప్పుడు గోదావరి జలాలు అందకుంటే మిగిలిన పంట కూడా పూర్తిగా ఎండిపోయి తాగునీటికీ తిప్పలు వచ్చే అవకాశముంది.

ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు దంపతుల పేర్లు లొడంగి కొమురయ్య–రేణుక. జనగామ జిల్లా దేవరుప్పుల గ్రామం. గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతి యాసంగిలో వదిలినట్లే ఈసారి దేవాదుల నీటిపై ఆశలు పెట్టుకొని తనకున్న మూడున్నర ఎకరాల్లో రూ. 2 లక్షల పెట్టుబడి పెట్టి నాటు వేసిన్రు. వీళ్ల పొలానికి రెండు బోర్ల ద్వారా నీటి వసతి ఉన్నది. గత పదేండ్లు చుట్టుపక్కల చెరువులు, కుంటలు గోదావరి జలాలతో నిండి అలుగుపోసేవి. దీంతో భూగర్భ జలాలు పెరిగి రెండు బోర్లు రాత్రి, పగలు నిండుగా పోసేవి. మొన్న నాట్లు వేసే సమయంలో కూడా ఈ రెండు బోర్లలో నీళ్లు బాగానే వచ్చాయి. దేవాదుల నీళ్లు వదలకపోవడంతో చెరువులు, కుంటలు ఎండిపోయాయి. ఇంకో తడి పారితే పంట చేతికొస్తుందనగా రెండు బోర్లు ఎండిపోయాయి. ఈనిన వరికి మరో తడి నీరు అందే పరిస్థితి లేక కండ్ల ముందే పచ్చటి పంట ఎండిపోయింది. మొన్నటిదాకా పచ్చగా కళకళలాడి చేతికొస్తున్న పంట కండ్ల ముందే ఎండిపోవడంతో చేసేదేమీ లేక దుఖాన్ని దిగమింగుకున్న రైతు దంపతులు పాడి గేదెను మేపుతున్నారు. మిగిలిన పొలాన్ని పశువులు, గొర్రెలకు మేతగా వాడుతున్నారు.

### ఎండిన 10 ఎకరాల పంటను గొర్లకు కొన్న..



మా ఊళ్లె రైతుల వరి చేన్లు ఎండిపోతె ఎకరానికి రూ.5 వేలకు కొన్న. పదెకరాలు కొని గొర్లు మేపుతున్న. ఎండాకాలం మేతలేక ఆగం కాకుండా ఇవి ఆసరవుతున్నయ్. ఎండలు దంచి కొడుతున్నయ్. పచ్చగడ్డి లేదు. తుమ్మలు లేవు. ఎండిన వరి చేన్లే గొర్లకు మేతయితాంది. రైతుకు ఈ డబ్బులు కొంతైనా ఆసరైతవి. కరువు కాలం కొడుతుంది. జీవాలకు నీళ్లు దొరుకుడు కష్టమే ఉంది. ప్రభుత్వం నీళ్లొదిలి చెర్లు, కుంటలు నింపాలె. లేకపోతె వరి ఎండినట్టే పసులు నీళ్లులేక సస్తయ్.

– మరాఠి సాయిలు, గొర్రెల యజమాని, కామారెడ్డిగూడెం, దేవరుప్పుల



దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెంలో సాయిలు కొనుగోలు చేసిన వరి పొలంలో మేస్తున్న గొర్రెలు



ధర్మసాగర్ రిజర్వాయర్‌కు వస్తున్న గోదావరి జలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

- నీటి విడుదలలో జాప్యం వల్లే ఎండిపోయిన పంటలు
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య
- ధర్మసాగర్ రిజర్వాయర్ సందర్శన

## బీఆర్ఎస్ హయాంలోనే
# దేవాదుల మూడు దశలు పూర్తి

ధర్మసాగర్, మార్చి 27: దేవాదుల ప్రాజెక్ట్ మొదటి, రెండో, మూడోదశ పనులు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేసినట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య గుర్తు చేశారు. దేవన్నపేట పంప్ హౌస్‌లోని మోటర్లు ఆన్ చేయగా గోదావరి జలాలు చేరిన ధర్మసాగర్ రిజర్వాయర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన పనిని తమ ఖాతాలో వేసుకునేందుకు కాంగ్రెస్ సర్కారు చూస్తున్నదన్నారు. నీటి విడుదల ఆలస్యం కావడం వల్లే నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పంటలు ఎండిపోయాయన్నారు. నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ. 25 వేలు పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి సకాలంలో మోటర్లు ఆన్ చేస్తే పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చేది కాదన్నారు. రేయింబవళ్లు కష్టపడి మోటర్లు ఆన్ చేసిన దేవాదుల ప్రాజెక్ట్ అధికారులకు కృతజ్ఞతలు చెప్పారు. తన హయాంలో దేవాదుల పైపులైన్ పనులు పూర్తి కావడం పూర్వజన్మ సుకృతమని రాజయ్య పేర్కొన్నారు. మండల ఇన్‌చార్జి కర్ర సోమిరెడ్డి, లాల్ మహ్మద్, బాలరాజు, గంటే సమ్మయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పులతడకగా
# ఎల్ఆర్ఎస్ ఫీజులు

- వాగ్వాదాలతో దద్దరిల్లిన కౌన్సిల్ హాల్
- సాంకేతిక సమస్యలతో సర్వర్ డౌన్
- గంటల తరబడి వేచి చూసిన దరఖాస్తుదారులు
- మరో 4 రోజుల్లో ముగియనున్న రాయితీ గడువు

***ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) ఫీజులు తప్పులతడకగా రావడంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన నెలకొంది. ఇంటిమేషన్ లెటర్‌లో వేలల్లో రావాల్సిన ఫీజు రూ. లక్షలు, కోట్లలో రావడంతో బెంబేలెత్తుతున్నారు. మరో నాలుగు రోజుల్లో 25 శాతం రాయితీ ముగుస్తున్న తరుణంలో గురువారం బల్దియా కార్యాలయానికి పెద్ద ఎత్తున వచ్చి మున్సిపల్ సిబ్బందితో వాగ్వాదానికి దిగడంతో కౌన్సిల్‌హాల్ దద్దరిల్లింది. 15 రోజులుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సర్వర్ డౌన్‌తో గంటల తరబడి సైట్ ఓపెన్ కాకపోవడంతో అర్జీదారులు అసహనం వ్యక్తం చేశారు.***

***- వరంగల్, మార్చి 27***

బల్దియా ప్రధాన కార్యాలయంలోని పౌర సేవా కేంద్రంలోని ప్రత్యేక కౌంటర్‌తో పాటు కౌన్సిల్ హాల్‌లో ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి తప్పులను సరిదిద్దే ఏర్పాట్లు చేశారు. సిబ్బంది కొరత, సాంకేతిక కారణాలతో సర్వర్ డౌన్‌తో దరఖాస్తుదారులు, సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. ఫీజుల మదింపు తప్పులతడకగా రావడంతో మున్సిపల్ సిబ్బందితో అర్జీదారులు వాగ్వాదానికి దిగారు. హనుమకొండకు చెందిన దరఖాస్తుదారుడికి ఏకంగా రూ. 7 లక్షలకుపైగా ఫీజు చెల్లించాలని రావడంతో సిబ్బందితో గొడవ పడ్డాడు. సర్వర్ డౌన్ ఉందని సముదాయించినా వినకుండా వాదనకు దిగాడు. శివనగర్‌లో చెందిన ఒకరికి ఏకంగా రూ. 14.50 కోట్లు ఫీజు చెల్లించాలని రావడంతో డాక్యుమెంట్లు పట్టుకొచ్చి అధికారులను నిలదీశాడు. ఇలా దరఖాస్తుదారులకు ఫీజుల మదింపు రూ. లక్షల్లో రావడంతో బల్దియాకు రోజూ వందల సంఖ్యలో వస్తున్నారు.

**దరఖాస్తుదారుల పడిగాపులు**

మూడు రోజుల క్రితం రోజంతా సర్వర్ డౌన్ కావడంతో దరఖాస్తుదారులు బల్దియా కార్యాలయంలో పడిగాపులు పడ్డారు. గురువారం సైతం సర్వర్ డౌన్ కావడంతో ఇబ్బందులు పడ్డారు. మార్చి 31తో ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం రాయితీ గడువు ముగుస్తున్న నేపథ్యంలో అర్జీదారులు అందివచ్చిన రాయితీ అవకాశం చేజారి పోతుందేమోననే ఆందోళనలో ఉన్నారు. గడువు నాలుగు రోజులే మిగిలి ఉండడంతో తప్పులను సరిచేసుకోవాలని తొందర పడుతున్నారు.



కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన దరఖాస్తుదారులు

# వార్డెన్‌పై సస్పెన్షన్ వేటు

- మరో ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు
- జనగామ ఎస్సీ హాస్టల్‌లో పేకాట ఘటనపై కలెక్టర్ చర్యలు

నమస్తే ఎఫెక్ట్

జనగామ చౌరస్తా, మార్చి 27 : జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ ఎస్సీ హాస్టల్ (ఏ) వార్డెన్ సంజీవను సస్పెండ్ చేస్తూ గురువారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే కుక్, కామాటి విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కూడా తొలగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి విక్రమ్ తెలిపారు. ఈ నెల 25న 'ఎస్సీ హాస్టల్‌లో పేకాట' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన కలెక్టర్ ఎస్సీడీడీ అధికారి విక్రమ్‌తో పాటు ఆర్డీవో గోపీరామ్‌ను విచారణ జరపాలని ఆదేశించారు. ఆరుగురు విద్యార్థులు పేకాట ఆడినట్లు విచారణలో బహిర్గతమైంది. అంతేకాకుండా హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తేలింది. దీంతో అధికారులిచ్చిన నివేదిక ఆధారంగా కలెక్టర్ ముగ్గురు ఉద్యోగులపై చర్యలు తీసుకున్నారు.

## ఫలించిన
# పల్లా కృషి

**జనగామ జిల్లా ఆస్పత్రికి చేరిన సీటీ స్కాన్ యంత్రం**

జనగామ చౌరస్తా, మార్చి 27 : జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి కృషితో జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి సీటీ స్కాన్ మిషన్ చేరుకుంది. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఈ నెల 24న జీరో అవర్‌లో జిల్లా దవాఖానలో సీటీ స్కాన్ యంత్రాన్ని ఏర్పాటు చేసే ఉద్దేశం ఉందా? లేదా? అని ఎమ్మెల్యే పల్లా ప్రశ్నించారు. దీంతో దిగొచ్చిన ప్రభుత్వం వెంటనే సుమారు రూ. కోటి విలువైన సీటీ స్కాన్ మిషన్‌ను మంగళవారం రాత్రి ఆస్పత్రికి పంపించింది. ఇది వరకు సేవలందించిన సీటీ స్కాన్ మిషన్ మరమ్మతుకు గురవడంతో కొన్నేళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోగుల ఇబ్బందిని గుర్తించిన పల్లా తాను శాసన సభ్యుడిగా ఎన్నికైన తర్వాత మొదటి అసెంబ్లీ సమావేశం నుంచి పలుమార్లు ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంతో పాటు వైద్యారోగ్యశాఖ అధికారులు, కలెక్టర్‌కు లేఖలు రాశారు. కాగా, పాత మిషన్‌ను తొలగించే పనిలో ప్రస్తుతం నిపుణులుండగా, మరో పది, పదిహేను రోజుల్లో కొత్త సీటీ స్కాన్ యంత్రాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



సీటీ స్కాన్ యంత్రాన్ని లారీ నుంచి దించుతున్న కూలీలు

# సబ్ రిజిస్ట్రార్లపై
# కలెక్టర్, డీఐజీ సీరియస్

- ప్రైవేట్ వ్యక్తులు, డాక్యుమెంట్ రైటర్ ప్రమేయంపై ఆరా

హనుమకొండ, మార్చి 27: హనుమకొండ వంద ఫీట్ల రోడ్డులోని వరంగల్ ఆర్వో కార్యాలయంలోని సబ్ రిజిస్ట్రార్లపై డీఐజీ, కలెక్టర్ ప్రావీణ్య ఆగ్రహం వ్యక్తం చేసి, గట్టిగానే మందలించినట్లు తెలిసింది. బుధవారం సాయంత్రం ఉద్యోగులు ఇళ్లలోకి వెళ్లిన తర్వాత ఓ డాక్యుమెంట్ రైటర్ కంప్యూటర్ క్యాబిన్‌లో ఉద్యోగి అవతారం ఎత్తిన విషయంలో బాధ్యులైన సబ్ రిజిస్ట్రార్లపై విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించినట్లు సమాచారం. ప్రైవేట్ వ్యక్తులు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయడంపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. ఒక్కరు చేసిన పనికి అందరికీ ఇబ్బందులు వస్తున్నాయని పలువురు డాక్యుమెంట్ రైటర్లు వాపోతున్నారు. కాగా, సబ్ రిజిస్ట్రార్‌కు ప్లాట్ల రిజిస్ట్రేషన్ విషయంలో ఇప్పటికే నోటీసులు జారీ చేయగా విచారణ చేపట్టిన అధికారులు నివేదికను డీఐజీకి పంపించినట్లు తెలిసింది. తాజాగా మళ్లీ ఈ ఘటన జరగడంతో ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని కార్యాలయ సిబ్బంది చర్చించుకుంటున్నారు. దీనిపై జిల్లా రిజిస్ట్రార్ ఫణీంద్రను వివరణ కోరగా ఎక్స్‌ప్లనేషన్ రిమార్క్స్ కాల్‌ఫర్ చేస్తూ మెమో జారీ చేశామని చెప్పారు. వివరణ ఇచ్చిన తర్వాత కలెక్టర్, డీఐజీకి పంపిస్తామన్నారు. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## మాజీ సర్పంచ్‌ల
# ముందస్తు అరెస్ట్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలక పాత్ర పోషించారని అన్నారు. వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, జీపీ భవనాలను నిర్మించినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్‌తో బిల్లులు ఆగిపోయాయని, నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ బిల్లులు ఒక్క రూపాయి కూడా విడుదల చేయడం లేదన్నారు. మాజీ సర్పంచ్‌లు బిల్లులు రాక అనేక ఇబ్బందులు పడుతున్నా అధికారంలో ఉన్న ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవటం లేదని, బిల్లులు విడుదల చేసే వరకు దశల వారీగా పోరాటం చేస్తామని పేర్కొన్నారు.



మహబూబాబాద్‌లో పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసిన మాజీ సర్పంచ్‌లు




జఫర్‌గఢ్ తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

### ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలి

**సీపీఎం ఆధ్వర్యంలో రైతుల ధర్నాలు**

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: నీళ్లు లేక ఎండిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలంటూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో రైతులు ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల సమయానికి గోదావరి జలాలు విడుదల కాక, చెరువుల్లో నీళ్లు లేక, వ్యవసాయ బావులు, బోరు బావులు అడుగంటిపోయి వేసిన పైర్లు ఎండిపోతున్నాయన్నారు. ఎండిన వరి పంటకు ఎకరాకు రూ.50వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.